క్లుప్తంగా

అంతర పంటలతో మేలు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పాం తోటల్లో తప్పనిసరిగా రైతులు అంతర పంటలను సాగు చేయాలని, తద్వారా రెట్టింపు ఆదాయాన్ని పొందవచ్చని స్థానిక అగ్రికల్చర్ ఏడీఏ రవి కుమార్, వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ నీలిమా అన్నారు. మంగళవారం వ్యవసాయ కళాశాల దత్తత గ్రామమైన మండలంలోని నారాయణపురం గ్రామంలో రైతువేదికలో జాతీయ సేవా సంస్థ ఆధ్వర్యంలో 'ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు–రెట్టింపు ఆదాయానికి అవకాశాలు', 'సుస్థిర వ్యవసాయం'అనే అంశాలపై రైతులకు అవగాహన, శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్‌పాం తోటల్లో అంతర పంటల సాగు విధానం, పద్ధతులు, జాగ్రత్తలతోపాటు ఆదాయ గురించి వారు వివరించారు. ఏఓ శివరాం ప్రసాద్, ప్రొఫెసర్లు డాక్టర్ శిరీష, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ రవికుమార్, ఏఈఓ షాకిరా బాను, రైతులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మను దర్శించుకున్న సినీనటుడు


ఆలయంలో రోషన్

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం లోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని 'కోర్టు' సినిమా నటుడు రోషన్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ బాధ్యులు స్వాగతం పలికి పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందించి సన్మానించారు.

ప్రభుత్వ భూమి గుర్తింపు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం కాలనీ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పక్కనే ఉన్న ఖాళీ స్థలాన్ని ప్రభుత్వ భూమిగా గుర్తించామని స్థానిక తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆ భూమిని పరిశీలించి, ఈ స్థలంలో ఏలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ మేరకు ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. లో ఎన్నికల డీటీ ఎస్‌కె.హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఉత్పత్తి

మణుగూరుటౌన్: సమష్టి కృషితో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి పాటుపడదామని మల్టీ డిపార్ట్‌మెంట్ బృందం కన్వీనర్, ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. మంగళవారం మల్టీ డిపార్ట్‌మెంటల్ బృందం ఆధ్వర్యంలో కొండాపురం భూగర్భగని, మణుగూరు ఓసీల లో ఉద్యోగులకు, అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024–25 సంవత్సరంలో కంపెనీ సాధించిన లాభనష్టాలు, భూగర్భగనుల భారీ యంత్రాల వినియోగం, బొగ్గు నాణ్యత మార్కెట్ సవాళ్లు, కంపెనీ భవిష్యత్ ప్రణాళికలు, ముందున్న సవాళ్లను వివరించారు. అధికారులు రాంబాబు, రమేశ్, అనురాధ, శ్రీనివాసచారి, శ్రీనివాస్, వీరభద్రరావు, చంద్రశేఖర్, బైరెడ్డి వెంకటేశ్వర్లు, నర్సింహారావు, మధుబాబు, భాస్కర్‌రావు, సాయిశ్వేత, సాయిమౌనిక, నవీన్ తదితరులు ఉన్నారు.

డిపో ఎదుట ధర్నా

మణుగూరురూరల్: మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీలో ఉన్న ఆర్టీసీ మణుగూరు డిపో ఎదుట ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. డిపో మేనేజర్ తీరు వల్ల ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి డిపో మేనేజర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సుధాకర్, పి.అచ్చారావు, కేవీ రామారావు, సీహెచ్ లింగయ్య, ఎస్ఆర్ బాబు, పి.మధు, ఆర్ఎస్ రావు పాల్గొన్నారు.

15 శాతం కేటాయించాలి

భద్రాచలంటౌన్: అధికారంలోకి వస్తే విద్యా అభివృద్ధికి 15 శాతం నిధులు కేటాయిస్తామని ఎన్నికల్లో హామీ ప్రకారం విద్యారంగ అభివృద్ధికి నిధులు కేటాయించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థి సమస్యల పరిష్కారానికి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యార్థి పోరుబాట యాత్ర మంగళవారం భద్రాచలం చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మునిగల శివ ప్రశాత్, సాయి, రామ్ చరణ్, అబ్దుల్ గని, శ్రావణి, సంధ్య, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.26 వేలు చెల్లించాలి

దమ్మపేట: పామాయిల్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో కార్మికుల స్థితిగతులపై సర్వే చేపట్టామని, ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ.. మంగళవారం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. కార్మికులకు ఆరోగ్య భద్రతతోపాటు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు. సంఘ నాయకులు రఘు పాల్గొన్నారు.

జై జై గణేషా..!


అశ్వారావుపేటరూరల్: రహదారిపై ఏర్పాటు చేసిన పూజ సామగ్రి విక్రయాల దుకాణాలు

అశ్వాపురం: విఘ్నాలు తొలగించే దేవుడు వినాయకుడు. ఏ పూజ చేయాలన్నా ముందు విఘ్నేశ్వరుడును ఆరాధిస్తుంటారు. అటువంటి వినాయకుడికి వాడవాడలా ప్రత్యేక పూజలు చేసేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. నవరాత్రుల్లో తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో బొజ్జ గణపయ్యకు పూజలు అందనున్నాయి. వినాయకుడి పూజలో పత్రాలు, పండ్లకు ప్రాధాన్యం ఇస్తారు.

పూలు.. పండ్లే పూజా ద్రవ్యాలు

వినాయక చవితినాడు గణనాథుడిని పూజించేందుకు పూలు, పండ్లే పూజాద్రవ్యాలుగా ఉపయోగిస్తారు. 21 రకాల పత్రితోపాటు వెలగకాయ, మారేడుకాయ, మొక్కజొన్న కంకులు, సీతాఫలం వంటి పండ్లతో పూజిస్తారు. ఇక బంతి, చామంతి, తామర, కలువ, జిల్లేడు, గన్నేరు పూలతో గణనాథుడికి పూజలు చేయడం ఆచారంగా వస్తోంది. వినాయక చవితిరోజు ఇళ్లల్లో పాలవెల్లి కట్టి వినాయకుడిని పూలు, పండ్లు, పత్రితో శోభాయమానంగా అలంకరించి నిష్టగా పూజిస్తారు.

పత్రి విశిష్టత..

వినాయక చతుర్థి రోజున విఘ్నేశ్వరుడికి ఉండ్రాళ్లతోపాటు పత్రిపూజ ప్రధానమైంది. వినాయకుడు, గజముకుడు ఏనుగుకు ఇష్టమైన ఆకులు కనుక పత్రితో పూజ చేస్తారు. 21 పత్రాలతో చవితిరోజున పూజ చేయడం వల్ల పూజించే వారికి సకల సంపదలు, అష్ట ఐశ్వర్యాలు, కార్యసిద్ధి చేకూరుతుందని పండితులు అంటున్నారు. ఈ పత్రాలు ఆరోగ్యపరంగా సైతం ఎంతో మేలు చేస్తాయి. పలు పత్రాల నుంచి వచ్చే సువాసనలు పీల్చడం, వివిధ రసాయనాలు కలిగిన వృక్ష సంబంధ పత్రాలను తాకడం వలన శరీరానికి ఆరోగ్యాన్ని చేకూరుస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

వీధివీధినా విక్రయ కేంద్రాలు

అశ్వారావుపేటరూరల్: గణపతి నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం కాగా.. మార్కెట్‌లో సందడి నెలకొంది. అశ్వారావుపేట పట్టణ కేంద్రంలోని భద్రాచలం మార్గంలో వినాయక చవితి పండుగ నేపథ్యంలో పండుగకు కావాల్సిన పూజ సామగ్రి, పత్రి, పూలు, చిన్నపాటి గణేష్ ప్రతిమలు విక్రయాల కోసం ప్రత్యేకంగా చిరు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేశారు. కాగా, మంగళవారం రోజంతా చిరు జల్లులతో కూడిన వర్షం పడటంతో ఆయా దుకాణాలు వెలవెలబోయాయి. మరో వైపు ఉత్సవాల కోసం పట్టణంతోపాటు మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, నారాయణపురం, ఆసుపాక, గాండ్లగూడెం, రామన్నగూడెం తోపాటు అన్నీ గ్రామాల్లో మండపాలను సిద్ధం చేసి, విద్యుత్ దీపాలంకరణతో అందంగా ముస్తాబు చేస్తున్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి..



గణపతి నవరాత్రి ఉత్సవాలు ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలి. వినాయకమండపాలకు అనుమతులు తీసుకోవాలి. వినాయకమండపాల నిర్వహణలో కమిటీ సభ్యులు బాధ్యతతో వ్యవహరించాలి. ఎల్లప్పుడు కమిటీ సభ్యులు అందుబాటులో ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలి. డీజే సిస్టంకు అనుమతులు లేవు. వాటిని వినియోగిస్తే సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తాం. – అశోక్‌రెడ్డి, సీఐ, అశ్వాపురం

నేడు వినాయక చవితి

- వాడవాడలా కొలువుదీరనున్న గణపయ్య

పట్టణంలో పండుగ శోభ


కిరాణా మర్చంట్స్ అసొసియేషన్ ఏర్పాటు చేస్తున్న మండపం

మణుగూరుటౌన్: మండల ప్రజలు ఏటా ప్రతిష్టాత్మకంగా జరుపుకునే వినాయక చవితి పురస్కరించుకుని పట్టణంలో ప్రధాన రహదారిపై మంగళవారం పత్రి, చిన్న గణనాథుడి ప్రతిమలు, పాలవెల్లిల విక్రయాలు జోరందుకున్నాయి. మణుగూరు మండల కేంద్రం కావడంతో సమీప పాంత్రాల ప్రజలు ఇక్కడి నుంచే విగ్రహాలతోపాటు పట్టణంలోని పూలమార్కెట్ వద్ద అడవుల నుంచి కోసి తెచ్చిన పత్రి, పాలవెల్లిలను కొనుగోలు చేస్తున్నారు. పట్టణంలో బులియన్ మర్చంట్, వెజిటబుల్ మర్చంట్, చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్, భవన కార్మికుల సంఘం, మెకానిక్‌ల ఆధ్వర్యంలో ఏటా నవరాత్రులు ఏర్పాటు చేస్తుండగా.. ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశారు. అదేవిధంగా ప్రధాన రహదారి, సుందరయ్యనగర్, కమలాపురం, రామానుజవరం, అన్ని గ్రామాల్లోని వీధుల్లో స్థానికులు కమిటీలుగా ఏర్పడి వినాయక చవితిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

మదర్ థెరిస్సా జయంతి


చంద్రుగొండ: మదర్ థెరిస్సా వేషధారణలో విద్యార్థిని

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనేక మంది రోగులకు సేవలందించి విశ్వమాతగా పేరు కీర్తిగడించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ ప్రెసిడెంట్ డెక్క నరసింహారావు, సెక్రెటరీ బాలకృష్ణ, సభ్యులు అంజిబాబు, ప్రమోద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ

భద్రాచలం పట్టణంలోని కారుణ్య అనాథాశ్రమానికి మదర్ థెరిస్సా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులను అందజేశారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా మంగళవారం ఐటీడీఏ పీఓ రాహుల్ తన చాంబర్‌లో రూ.20 వేల విలువ గల నిత్యవసర వస్తువులను చిన్నారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి, నవీన్, వంశీ, సాయి కుమార్, బాబాజీ, బాల రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని ప్రతిభ విద్యాలయంలో మదర్ థెరిస్సా జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె సేవా దృక్పథంతో ప్రపంచ వ్యాప్తంగా పేరు సాధించారని చిన్నారులకు ఉపాధ్యాయులు వివరించారు. పేదలకు, అన్నార్తులకు థెరిస్సా అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు ఎస్‌కె.పర్వీన్, ప్రియాంక, అరుణ, షబాన, రమణ పాల్గొన్నారు.

సింగరేణి పరిరక్షణకు పోరాడుదాం


సమావేశంలో మాట్లాడుతున్న టీబీజీకేఎస్ నాయకుడు వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల చట్టాలు, హక్కుల రక్షణ కోసం పోరాడుదామని మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. మండలంలోని పీవీ కాలనీలో గల జయశంకర్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం 2024–25 సంవత్సరానికి సంస్థ ఆర్జించిన వాస్తవ లాభాలను ప్రకటించి కార్మిక వర్గానికి 35శాతం వాటాను చెల్లించాలని, అన్‌ఫిట్ కాల పరిమితిని 24 నెలల నుంచి 36 నెలలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలపై టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. నాయకులు బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, మస్తాన్, రామాచారి, ఇజ్రాయేల్, ముకేష్ కుమార్, మురళీ కృష్ణ, రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

'పూడికతీత పనుల్లో అవినీతి'


సమావేశంలో మాట్లాడుతున్న మహిళ మండలి బాధ్యులు

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ పరిధి కట్టువాగు, మెట్ల వాగు, కోడిపుంజుల వాగుల్లో పూడికతీత పనులు నామమాత్రంగా చేపట్టి అవినీతికి పాల్పడ్డారని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూణెం సరోజ ఆరోపించారు. మణుగూరు మంగళవారం ఆమె మాట్లాడుతూ పూడికతీత పనులు సరిగా నిర్వహించని కారణంగా భారీ వర్షం వస్తే ముంపు ఎదురయ్యే ప్రమాదముందని తెలిపారు. సింగరేణి విడుదల చేసిన నిధులతో పనులు చేపట్టినా కొన్ని వీధులు ముంపునకు గురవడంపై ఇరిగేషన్ అధికారులు మౌనం పాటిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా త్వరలో సీఎంకు వివరిస్తామన్నారు. సమావేశంలో షబానా, సౌజన్య, రేణుక, శ్యామల, సుజాత, శైలజ, పార్వతి, వసంత పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన


బూర్గంపాడు: సారపాకలో నిరసన ర్యాలీ చేపడుతున్న బీజేపీ నాయకులు

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం తోపాటు స్థానిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. బీజేపీ ఆధ్వర్యంలో పలు మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టారు. ర్యాలీలు తీసి, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టారు. తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించిందన్నారు. సీతారామ ప్రాజెక్ట్‌తో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్

'ఉల్లాస్' ఆధ్వర్యంలో శిక్షణ


అన్నపురెడ్డిపల్లి: పుస్తకావిష్కరణ చేస్తున్న ఎంపీడీఓ మహాలక్ష్మి

కరకగూడెం: కరకగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ మండలస్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించి పూర్తి చేశారు. ఉల్లాస్ ద్వారా గ్రామీణ మహిళా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ప్రధాన లక్ష్యమని ఎంఈఓ మంజుల తెలిపారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల నుండి ఎంపికైన మొత్తం 32 మంది ఉపాధ్యాయులు, వీఓఏలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. అనంతరం ఉల్లాస్ బ్రోచర్లను ఎంపీడీఓ కుమార్, ఎంపీఓ మారుతి యాదవ్, ఏపీఎం ఇన్‌చార్జ్ ముత్యాలరావు, సీసీ విజయలక్ష్మి, మండల రిసోర్స్ పర్సన్స్ జె.వెంకటేశ్వర్లు కె.సూర్యనారాయణతో కలసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీఓఏలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు జయబాబు, సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.

పినపాక: పినపాక మండలంలో వయోజన విద్యాభవన అక్షరాస్యత ఉల్లాస్ శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈఓ నాగయ్య ప్రారంభించారు. ఎంతటి వయసు వారైనా చదువుకోవాలనే తపన ఉంటే అందుకు తగిన రుసుము చెల్లిస్తే వారికి పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందజేస్తామని, దీనిపై గ్రామాలలో అవగాహన కల్పించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మహిళలు అక్షరాస్యత సాధించాలని ఎంపీడీఓ కావూరి మహాలక్ష్మి అన్నారు. మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉల్లాస్ నవభారత్ సాక్షరతా శిక్షణా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీడీఓతోపాటు ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ.. 15 ఏళ్ల వయస్సు పైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. రిసోర్స్ పర్సన్‌లు జి.రామ్మోహన్, బి.మోహన్, హెచ్‌ఎం ఏ.వెంకటేశ్వరరావు, ఏపీఎం నాగేశ్వరరావు, శిరీష, నాగమణి, వెంకటరమణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


లింగగూడెంలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

గుండాల: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలో పర్యటించారు. రూ.20లక్షలతో నిర్మించిన దామరతోగు, లింగగూడెం గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. నాగారం, దొంగతోగు గ్రామాల్లో సీసీ రోడ్లు ప్రారంభించి, రూ.1.50 లక్షలతో నాగారంలో, రూ.2.40 లక్షలతో మోదుగులగూడెం–సజ్జలబోడు గ్రామాల్లో బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం రైతు వేదికలో నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. దామరతోగులో రెవెన్యూ, విద్యా, వైద్యం, ఇరిగేషన్, విద్యుత్, భగీరథ, వ్యవసాయ, అటవీశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ.. పనులను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కొడవటంచకు కిన్నెరసాని నదిపై, చెట్టుపల్లి దున్నపోతుల వాగుపై హైలెవల్ బ్రిడ్జీలకు ప్రణాళికలు పంపామన్నారు. అటవీశాఖ అనుమతులు లేని రోడ్లు, బ్రిడ్జీలకు సైతం అనుమతులు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రసీద్, ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ శ్యాంసుందర్ రెడ్డి, పీఆర్‌డీఈ రామనాథం, ఐబీ ఏఈ పృథ్వీ, కాంగ్రెస్ నాయకులు ముత్యమాచారి, పాంబోయిన ముత్తయ్య, ఎస్‌కె.ఖదీర్, దారా అశోక్, కిరణ్, వాజీద్, పద్మ, లక్ష్మి, బుచ్చయ్య పాల్గొన్నారు.

29న ఐటీఐలో జాబ్‌మేళా

మణుగూరురూరల్: ఈ నెల 29వ తేదీన మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ జి.రవి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మణుగూరు ఏరియాలోని సింగరేణి కోల్ మైన్స్‌లోని ఎస్ఎంఎస్ కంపెనీలో టెక్నీషియన్, ఆపరేటర్లు ట్రైనింగ్ ఉద్యోగాల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐలో ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, సర్వేయర్, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ కోర్సులు పూర్తి చేసిన 18 ఏళ్ల నుంచి 21 సంత్సరాల లోపు వారు ఈ జాబ్ మేళాకు హాజరుకావాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గలవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సకాలంలో హాజరై జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

భద్రాద్రి కళాకారుడికి అవార్డు

భద్రాచలంటౌన్: భద్రాచలానికి చెందిన కవి తోటమళ్ల సురేష్‌బాబుకు తెలుగు తేజం పురస్కారం లభించింది. ఈమేరకు శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కల్లిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం మంగళవారం ఆయనకు లేఖ పంపించారు. సాహిత్యంలో చేస్తున్న కృషికి గాను సురేష్‌బాబుకు ప్రకటించిన అవార్డును ఈనెల 31న ఏపీలోని పల్నాడులో అందించనున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్‌కు గాయాలు

దుమ్ముగూడెం: మండలంలోని గడ్డోరుగట్ట సమీపాన పొలంలో దమ్ము ట్రాక్టర్ తిరగబడగా డ్రైవర్ ఇరప జంపన్నకు గాయాలయ్యాయి. ఆయన మంగళవారం ఓ రైతు భూమిలో దుమ్ము చేస్తుండగా ట్రాక్టర్ దిగబడడంతో జంపన్న కూరుకుపోయాడు. ఈమేరకు గ్రామస్తులు మూడు ట్రాక్టర్ల సాయంతో తిరగబడిన ట్రాక్టర్‌ను బయటికి తీసి జంపన్నను ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు షూస్ పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని రామారావుపేట పంచాయతీ ఒడ్డు గుంపు గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఐటీసీ పీఎస్‌పీడీ భద్రాచలం మహిళా సమితి ఆధ్వర్యంలో మంగళవారం షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం మహిళా సమితి సెక్రటరీ మాధవి మాట్లాడుతూ.. తమ సంఘం తరుపున గత 45 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, దానిలో భాగంగానే విద్యార్థులకు షూస్ పంపిణీ చేశామని తెలిపారు. హెచ్‌ఎం జె.జ్యోతి, మహిళా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఐను కలిసిన బీఎస్పీ నాయకులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం సీఐ తాళ్ళూరి వెంకటప్పయ్యను బీఎస్పీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కారం చేశారు. శివకుమార్ మాట్లాడుతూ.. వృత్తి నిబద్ధత మూలంగానే వెంకటప్పయ్య సీఐగా పదోన్నతి పొందారని అన్నారు. బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్, మండల పార్టీ ఇన్‌చార్జ్ తుర్రం రాజు, మండల అధ్యక్షుడు కొండా ప్రమోద్, నాయకులు జక్కా వెంకట్, సందీప్ పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలే పర్యావరణ హితం

వినయక చవితిని పురస్కరించుకుని పలు విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో గణేష్ ముందస్తు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు, ఇతర సంఘాల బాధ్యులు మట్టి విగ్రహాలను తయారు చేశారు. ప్రకృతి సిద్ధమైన రంగులు, పూలు, ఆకులు ఉపయోగించి మట్టి విగ్రహాలు, పర్యావరణ ప్రాముఖ్యతను చాటిచెప్పారు. తయారుచేసిన మట్టి ప్రతిమలను పలువురికి పంపిణీ చేశారు. ఇళ్లలోనూ మట్టి వినాయకుడినే ప్రతిష్ఠించాలని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పర్యావరణానికి హానికరమని ఈ సందర్భంగా వెల్లడించారు.

– సాక్షి నెట్‌వర్క్


కరకగూడెం: భట్టుపల్లిలో మట్టితో చిట్టి వినాయకులను తయారు చేసుకుంటున్న విద్యార్థులు


పినపాక: విద్యార్థులు తయారుచేసిన మట్టి విగ్రహాలతో ఎంఈఓ నాగయ్య


భద్రాచలంఅర్బన్: మట్టి వినాయకుడి ప్రతిమలను పంపిణీ చేస్తున్న కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ సభ్యులు


అన్నపురెడ్డిపల్లి: మట్టి విగ్రహాన్ని తయారు చేస్తున్న ఎర్రగుంట జెడ్పీ పాఠశాల విద్యార్థినులు


అశ్వారావుపేటరూరల్: మట్టి ప్రతిమ తయారు చేసిన విద్యార్థికి బహుమతి అందిస్తున్న హెచ్‌ఎం


దమ్మపేట: మొద్దులగూడెంలో మట్టి గణేష్ ప్రతిమలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


మణుగూరుటౌన్: శ్రీవిజ్ఞాన్ పాఠశాలలో గణనాథుడి ఊరేగింపు..


కరకగూడెం: 'యంగ్ రైసింగ్ స్టార్' ఆధ్వర్యంలో రూపొందిస్తున్న మట్టి గణపతి ప్రతిమ


అశ్వారావుపేటరూరల్: మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న వాసవీక్లబ్ బాధ్యులు


గుండాల: విగ్రహాలు పంపిణీ చేస్తున్న మానాల వెంకటేశ్వర్లు దంపతులు, తదితరులు